పోటీలో ఒకపార్టీ తగ్గుట. ఐతే వాంఛించ వలసినది ఇంతకంటె ఎక్కువగానే. దేశపు మొత్తాన వచ్చిన వోట్లనుబట్టి తాము రెండవపార్టీ అని ఎగిరిపడకూడదు. మొత్తపు ఓటు ఎన్నివచ్చినా ఒకచోటనైనా మెజారిటీ వోట్లు రాకపోతే ఒక్కస్థానమైనా లభ్యముకాదు. గత ఎన్నికలలో అనేక పార్టీలు పోటీ చేయడమువలన వోట్లు విభజించబడుటయే తమ పరాజయానికి కారణంగా చెప్పుకున్నారు సోషలిస్టులు, ప్రజా పార్టీ వారు. అయితే ఈవిధంగా పలువురు పోటీ చేయడము వచ్చే ఎన్నికలలోకూడా ఉంటుంది. కాంగ్రెసుకి ఓట్లు సంపాదించడానికి పండిత నెహ్రూ ఉన్నారు; కమ్యూనిస్టులకి, మతోన్మాదులకి వారివారి సిద్ధాంతాలు ఓట్లని సంపాదించగలవు. ప్రజా సోషలిస్టు'పార్టీలు ఇదివరలో తమ నాయకుల పలుకుబడిపై ఎక్కువ ఆధారపడినవి. నూతన ప్రజా సోషలిస్టు పార్టీవారు తమ విధానాన్ని, ఆశయాల్ని స్పష్టంచేసి వాటికే ఎక్కువ ప్రాముఖ్యము నివ్వాలి. ఈ సందర్భంలో ఒకటి గమనించదగినది. సోషలిస్టులు తమ ఎన్నికల ప్రచారంతో ప్రతి సభలోను కమ్యూనిస్టులకు ఓటు చేయడముకన్న కాంగ్రెసుకే ఓటు చేయవచ్చునని పదేపదే చెప్పడమువలన వారు తమ ప్రత్యేకతకే ముప్పు తెచ్చుకున్నారు. కాంగ్రెసు కమ్యూనిస్టులు మాత్రమే ముఖ్యమైన పక్షాలని ప్రజలను కొనుటకు అవకాశం కలిగింది. తాము అనుసరిస్తున్న విధానము సరియైనదని తాము అనుకొనుటయే చాలదు: అదిసరియైనదని ప్రజలను నమ్మించి తృప్తిపరచవలెను.

కనుక ప్రజా సోషలిస్టు పార్టీ నిజముగా గాంధీజీ సలహాను పాటించి లోకసేవక సంఘమును స్థాపించి, స్వార్థపరత్వములేని కృషిచేసి నిర్మాణ కార్యక్రమముద్వారా ప్రజల మెప్పును పొందిననే దానికి భవితవ్యం ఉంటుంది.

క థా ని క

# ఓ డి పో యి న శ ర్మ

పి. వి. పల్లి

శర్మ తన పదోయేటనే తల్లిదండ్రుల్ని పోగొట్టుకున్నాడు. పూర్తిగా నిరాశ్రయుడయిపోయాడు. ఉన్న ఒక్క మేనమామా, భార్యకి బానిస కావడం మూలాన, శర్మని దరితీయలేకపోయాడు. అయితే శర్మతోపాటు అక్కచెల్లెళ్లు గాని, అన్నదమ్ములుగాని, మరెవరూలేరు. అప్పటికి అతను ఫస్టుఫారం మాత్రమే పాసయ్యేడు.

రామానుజంగారు శర్మనిజూచి కరిగిపోయారు. అతనిముఖంలో సల్లక్షణాలు ఉట్టిపడుతున్నాయనీ, యెప్పటికేనా పెద్దవాడు కాగలడనీ-తను యెలాగన్నా అతనిని చేరదీసి విద్యాబుద్ధులుచెప్పించాలనీ—ఆయన ఉబలాటపడ్డారు. ఆయన మొట్టమొదటిసారిగా చూడడం, తన సహకారోద్యమంలో తనకి మారుగా అతను బాగా పనిచెయ్యగలడని, అప్పటికి తనుకూడా శక్తిహీనుడైపోతాననీ-ఉద్యమం మరి కుంటుపడదనీ ఆయన ధృఢసంకల్పం.

అయితే యిలాంటి కుర్రాళ్ళనిద్దర్ని ఆయన లోగడ చేరదియ్యడం, పెద్దవారుకాగానే ఎదురుతిరిగి అతనిమీద దుష్ప్రచారం చేసి అతని దగ్గర నుండి వెళ్ళిపోవడం జరిగింది. అలాగ్గా శర్మ విషయంలో యీయన అనుకోలేదు. మాణిక్యమ్మగారికి శర్మవిషయం బాగా నచ్చచెప్పాడు. యింతకుముందు తననివిడిచిపెట్టి వెళ్ళిన యిద్దరూ బ్రాహ్మణేతరులుగనుక తమనినమ్మలేదని దంపతులు సమాధానపడ్డారు.

మాణిక్యమ్మగారుకూడా కాస్త దయాదాక్షిణ్యాలుగల మనిషే. తన యిద్దరు కూతుళ్ళూ తప్పితే మరి పిల్లలు కలుగరని ఒక జ్యోతిష్కుడు చెప్పినదాంట్లో ఆమెకి నమ్మకం కలిగింది. తత్ఫలితంగా, రెండోది పుట్టిపదేళ్ళయినా మరిసంతానం కలుగలేదు. అంచేత శర్మని కొడుగ్గా భావించి, విద్యాబుద్ధులు చెప్పించి, ఓ యింటివాణ్ణిచేసి ఒదిలేద్దామని తనుకూడా నిశ్చయించుకుంది.

స్వగ్రామంలోనే స్కూలు ఫైనలు పూర్తి చేయించారు. అప్పటికి కాస్త గడసరి దేరినాడు శర్మ. నూనూగు మీసాల నూత్న జవ్వనం పొడ చూపింది. రెండు సంవత్సరాలపాటు తనతోపాటు సభలకీ సమావేశాలకీ వెంటేసుకు వెళ్ళారు రామానుజంగారు. తను నూతనంగా మూడేండ్ల క్రితం స్థాపించిన క్రొత్త సంఘం అదే గాంధీయ పద్ధతులమీద నడిపే సర్వోదయ సంఘం తరఫున బాగా, నమ్మకంగా పనిచెయ్యవలసినదిగా నచ్చచెపుతూవచ్చారు. ప్రజల్లో దీనిగూర్చి విరివిగా ప్రచారం చెయ్యాలని ఆదేశించారు. సంఘసేవయే మన యేకైక లక్ష్యమని చెవినిల్లు గట్టుకుని ఉద్బోధించారు. విన్నాడు శర్మ విషయాలనన్నిటినీ. ఆ రెండుసంవత్సరాలూ తను బాగానే ప్రచారంచేశాడు సంఘసూత్రాల్ని. రామానుజంగారిలో ఆశ రేకెత్తింది. తనని బాగా అర్థంచేసుకున్నాడనీ, తన ఉద్యమంలో తనకి సహకారిగా వుంటాడనీ నిశ్చయంచేసుకున్నాడతను. ఇక తను అట్టే శ్రమపడనక్కరలేదు. తన ఉద్యమంలో తనకి వారసుడొకడు బయలుదేరాడు.

ఓనాడు శర్మకి హఠాత్తుగా ఓ ఆలోచన బయలుదేరింది-మేష్టరీ చేదామని. అందుకు రెండేండ్లు శిక్షణ కావాలి. పెద్ద వ్యయంతో కూడుకున్న విషయమది. ఏదో స్కూలుఫైనలు పరకూ అంటే తనని లాక్కొచ్చారు కాని యీ శిక్షణ విషయంలోకూడా రామానుజం గారిని కష్టపెట్టడమా?—అతనూ సామాన్య సంసారే గాని కాస్త వున్నవాడు కాదాయెను. ఉన్న ఆస్థినంతటినీ తన ఉద్యమంలో లీనం చేశాడు. అయినా పోగా మిగిలిన యెకరన్నర మాగాణీ మీదా,' అచ్చు యంత్రంమీదా ఆధారపడి కాలం సాగిస్తున్నాడాయన. అంచేత యీ విషయం అతని ముందుంచబోవడానికి సాహసం చాలింది కాదు.

మూడుదినాలపాటు మథనపడ్డాడు. కాని తనని ఆవిషయం యింకా పీడించుకు తింటునే వున్నది. సాహసించి ఓరాత్రి భోజనాలయింతర్వాత వెన్నెల్లో కూచుని దంపతులు లోకాభిరామాయణం పారాయణచేస్తున్న సందర్భంలో వారి ముందుంచాడు యీ విషయాన్ని.

రామానుజంగారు అలా ఓమాటు ఆలోచించి, శిక్షణ అయింతర్వాత యెక్కడ పని చేస్తావని అడిగాడు. చకితుడయ్యాడు శర్మ. అది యింతకు ముందు తను నిర్ణయించుకోనని సమస్య. ఒక్క క్షణం ఆలోచనలోపడ్డాడు. ఆ వూరులోనే పని చేస్తానన్నాడు. పనిచేస్తూ తీరికకాలంలో ఉద్యమం సాగించగలనని శపథంచేశాడు. రామానుజంగారు నమ్మారు. విశాఖపట్నంలో తనకి తెలిసిన గోపాలరావుగారింట్లో భోజన యేర్పాటు చేస్తాననీ, పై ఖర్చులకి నెలనెలా పంపుతూంటాననీ, సంఘంతరఫున నిన్ను శిక్షణకి పంపడానికి యేర్పాటు చేస్తాననీ, తదుపరి సంఘంతరఫున తెరువబడే స్కూల్లో పని చెయ్యవలసి వుంటుందనీ చెప్పారు. శర్మ ఉప్పొంగిపోయాడు.

• • *

గోపాలరావుగారుకూడా శర్మని బాగానే ఆదరిస్తున్నారు. తను అద్దెకు తీసుకున్న ఆ చిన్న యింట్లోనే వీథిలోని ఒకకొట్లో శర్మకి బస యేర్పాటుచేశారు. మొదటి సంవత్సరం బాగానే గడిచిపోయింది. సంఘం తాలూకు ఫండ్సు కొంచెం తగ్గాయి. నెలనెలా పంపడంలో కొంత విలంబన జరుగుతూ వచ్చింది. అయినా ఎలాగో సాహసించి పంపేవారు రామానుజంగారు డబ్బు.

ప్రకృతి మానవుణ్ణి కొన్నికొన్ని సమయాల్లో లొంగతీసుకుంటుంది. అతను పెట్టుకున్న నియమాలకి భంగం కలిగించుతూంటుంది. అయితే మానవుడు ప్రకృతికి లొంగిపోతాడు. దుష్టశక్తులకి లోనవుతూంటాడు. శర్మ యిప్పటిదాకా యెటువంటి వాంఛలకీ మనసుని పోనివ్వలేదు. కాని, గోపాలంగారి మేనకోడలు రత్నమ్మకి లొంగిపోయాడు. మొదట్లో కాస్త జెట్టు సరిచేసినా, చివరికి కాదనలేకపోయాడు. ఆఖరికి ఒకరినొకరు ఒక క్షణం కూడా విడిచివుండలేని పరిస్థితి యేర్పడింది. గోపాలరావుగారు గమనించలేదు. రత్నమ్మ తల్లిలేని దవడం మూలాన, తనే చేరదియ్యవలసి వచ్చింది. ఆమె తండ్రి రెండోమారు పెండ్లాడిన భార్యకి రత్నమ్మ అంటే ద్వేషం. సహజంగావున్న సవతితల్లి నైజగుణం—యెక్కడికీ పోలేదు. అయితే గోపాలంగారి భార్య యీ విషయంలో మరేమీ అనలేదు.

శర్మ, తన శిక్షణకాలం పూర్తిచేసి రామాను

జంగారి దగ్గరకి చేరుకున్నాడు. కాని మనిషిలో మార్పు కలిగింది. రెండు నెలలు గడిచినా-తను వచ్చి, యెటువంటి సహాయ కార్యములోనూ పాల్గొనలేదు. వచ్చింది మొదలు యేదో శృంగార ప్రబంధం పట్టుకుని కూర్చోవడం-యేదో ఆలోచనలలో మునిగిపోవడం తప్పితే-మరోటి లేదు. నౌకరు సన్యాశి యెంతగానో ప్రయత్నించాడు శర్మ మనస్సును గాలించడానికి. మాణికమ్మగారు కూడా సన్యాశితో పాటు ప్రయత్నించేరు. చివరికి కృతార్థులయ్యారు.

ఓనాడు రామానుజంగారు లేని సమయం చూచి, ఆ యిద్దరి ముందూ తన ప్రేమ గాథని యేకరుపెట్టాడు. రత్నమ్మని వదలి ఒక్కక్షణం కూడా తను యిక్కడ వుండలేననీ, తనకి ఇక్కడ యేమీ చెయ్యడానికి మనసు పుట్టడంలేదనీ-రత్నమ్మకోసం యెంతటి త్యాగాన్నైనా చెయ్యగలననీ, యిట్లా ఓ ఉపన్యాసం మాదిరిగా వల్లించేశాడు.

మాణికమ్మగారు స్తబ్ధురాలైంది. తను ముందు ఊహించినకన్న విపరీతంగా జరుగుతుందని ఊహించగలిగింది.

సన్యాశి,ఓనాడు శర్మని-ఒక రహస్య ప్రదేశం తీసుకుపోయాడు.

“శర్మగారూ-మీరు యిట్లా విచారం పెట్టుకుంటే ఉద్యమం సన్నగిల్లుతూంది. రామానుజంగారికి మీరు ఏమీ సహాయం చెయ్యడం లేదు. ఆయన యేమన్నా అనుకోగలడు” అన్నాడు సన్యాశి. సన్యాశికి యజమానిమీద అమితమైన విశ్వాసం.

“ఏమన్నా అనుకోనీ సన్యాశీ—నేను ఇక్కడ వుండానికి మనసొప్పటం లేదు—”

“మరి—?”

“పట్నం పోతాను. రత్నమ్మని పెళ్ళి చేసుకుని హాయిగా యే హైస్కూల్లోనో మేస్టరీ చేద్దామనివుంది.”

సన్యాశి మొహం పాలిపోయింది. నోటంట మాట రాలేదు. అలా సూన్యంలోకి చూస్తూ ఓ అయిదునిముషాలుండిపోయాడు.

“మీరేదో ఆయనకి కుడి భుజంగా వుంటారనీ, మిమ్మల్ని ఓ ఉన్నత శిఖరంమీద కూచోబెడదామనీ, ఉద్యమమంతా మీ చేతుల మీదుగానే నడిపించి తను విశ్రాంతి తీసుకుందామని అనుకున్నాడాయన. మీరు ఇలా సంచరిస్తారని ఆయన యిన్నడూ అనుకోలేదు.”

“నేనేం చేసేది సన్యాశీ. రత్నమ్మకి యిక్కడుండమంటే యిష్టంలేదు. ఆమెకోసం నేను యీ స్థలం విడిచిపెట్టక తప్పదు.”

“ఒక్కమాట. మీరు బాగా ఆలోచించండి మీరు యేదిక్కూలేక అక్కడక్కడ తిరుగుతున్న సమయంలో మిమ్మల్ని చేరదీసి మీకు విద్యాబుద్ధులు చెప్పించాడాయన. తండ్రికన్నా ఘనంగా చూచాడు మిమ్మల్ని. అమ్మగారుకూడ మాతృదేవికన్నా అమితమైన వాత్సల్యంతో మిమ్ములను పెంచారు. మీరు సొమ్ము పంపమని ఉత్తరము రాసినప్పుడల్లా సంఘం సొమ్ము లేకపోయినా అక్కడక్కడా చందాలు వసూలుచేసి మీకు పంపించేవారు. ఆయన ఎంతకష్టపడ్డాడో మీరు గమనించారా? ఓనాడు మీరు అర్జంటుగా యాభై రూపాయిలు పంపమని టెలిగ్రాం ఇచ్చినప్పుడు అమ్మగారి మంగళసూత్రాలమ్మి మీకు పంపడం నేనెన్నటికీ మరిచిపోలేను. ఆనాడు నాకు యెంతగానో బాధ అనిపించింది. అయినా బాబుగారి హృదయ నైర్మల్యానికి నాలోనేను యెంతగానో పొంగిపోయాను. ఇంకా అనేక విధాల మీకు నిర్వాకం చేశారే మీరు యావజ్జీవితం సంఘం తరఫున పనిచేస్తానని సంఘం పేర వ్రాసి యిచ్చిన బాండు సంగతి మరచిపోయారా?”

“నువ్వు ఎంతగానైనా చెప్పు యీ సమస్యలకన్న, నా ప్రేమాధిదేవత. రత్నమ్మ సమస్య గొప్పది. దాన్ని పరిష్కరించడానికి నేను వెళ్ళిపోతున్నాను.”

“పిచ్చివాడా! ఆ రత్నమ్మనే పెళ్ళిచేసుకో. ఎవరూ కాదనరు. ఆ పెళ్ళి చేయించే పూచీ నాది. కాని బాబుగారికికూడా కాలం మళ్ళింది. ఇక ఆయన పూర్వంలా సంఘం గూర్చి పాటుపడలేరు. మిగతా సభ్యులు యేమంత గొప్ప వాళ్ళుకారు. సంఘంమాట అటుంచి యీఅచ్చు యంత్రం యింకా యితర పనులూ చూచేవారెవరయ్యా? అంచేత నువ్వు ఆ అమ్మాయినే పెండ్లి చేసుకొని యిక్కడేవుండు. నేను-నా బొందిలో ప్రాణం వున్నంత కాలం యిక్కడేనుండి కదలను.

నేను నిన్ను జాగ్రత్తగా చూచుకుంటాను."

"మరి అట్టే చెప్పకు సన్యాశీ—"

సన్యాశి మరి మాటాడలేదు.

ప్రవాహానికి ఎదురీదడం కష్టం-ఎదురీదితే, అందులో కొట్టుకుపోతాం. కాని శాశ్వతంగా నిలిచేది ప్రవాహంకాదు. ఉధృతం తగ్గగానే మళ్ళీ యధారూపంలో, మెల్లగానే పారుతుంది నీరు.

రామానుజంగారికి తెలిసిందీవిషయం. ఓనాడు "శ్రవణానందం" చదువుతూండగా, శర్మని పిల్చి అడుగుదామనుకున్నారు. కాని అడిగినందువల్ల ప్రయోజనం వుండదని అనుకున్నారు. అయితే "శర్మ వెళ్ళిపోవడం"లో ఆయనకి కష్టం కలుగలేదు. విశ్వాసఘాతకుడైపోతున్నాడు శర్మ, ఇక ముందెలా బ్రతుకుతాడా, అని ఆయన విచారించేడు. తనమీద దుష్ప్రచారం లేవదీసి "యీాయనకేం తెలుసు? యింతకన్న సంఘ సంస్కర్తలనేం వున్నారు" యిలాంటిమాటలు తన స్నేహితుల ముందూ, తన విరోధుల ముందూ అంటూంటే, తెలుసుకొని యెంతగానో మధనపడ్డాడాయన. మాణిక్యమ్మగారు స్వహస్తంతో తన మంగళసూత్రాని చ్చి, "దీనమ్మి ఆసొమ్ము శర్మకి పంపండి"అన్న దృశ్యం ఆయనముందు మెరిసింది. —కంటతడిపెట్టుకున్నారు. తన విధి తను నెరవేర్చారు. యే దిక్కూలేనివాడికి రెక్కలువచ్చినట్లు చేశారు. యికనైనా జాగ్రత్తగా బ్రతుకుతే అంతేచాలు అనుకున్నారు.

ఓ అర్థ రాత్రి యెవరితోనూ చెప్పకుండా ప్రయాణం కట్టాడు శర్మ పట్టణానికి. ఓమంచి ముహూర్తం చూచుకుని ఓహైస్కూల్లో ప్రవేశించాడు. రత్నమ్మ తన ప్రియురాలు. తన జీవితంలో యేమీ "లోటు" వుండదు. ఇక తన జీవితం ఓపూలబాటమీద నడుస్తుంది. నిర్మించుకుంటున్నాడు గాలిమేడలు.

రత్నమ్మకూడా అలాగే నటిస్తుంది. గోపాలంగారికీ, తనకీ ఎంతగానో రభస జరిగింది. అయినా రత్నమ్మ లక్ష్యపెట్టలేదు. తన స్నేహితుడు (రామానుజం)కి ఎదురుతిరిగిన శర్మనిచూచి అసహ్యించుకున్నాడు. అయినా తను యేమీ చెయ్యలేకపోయాడు.

* * *

ఆర్నెల్లు సంసారం బాగానే గడిచింది. రత్నమ్మ ఒంటినున్న అయిదుతులాల బంగారమూ, నెలనెలా శర్మతెచ్చే యాభై రూపాయిలూ జల్సాలకీ విలాసాలకీ సరిపోయాయి. ఇక యాభై రూపాయిలతోటే సంసారం గడవాలి. ఇది పెద్ద సమస్యే. సంసారం సులభమనుకున్న శర్మ ఆలోచనలో పడ్డాడు. రత్నమ్మకి, తన అసమర్థత తెలుస్తూంది. యాభైకన్న తను యెక్కువ తేలేడు. రత్నమ్మ జల్సాలు మరి సాగవు. శర్మమీద రోత బయలుదేరింది.

మంత్రవాక్యాలతో, మంగళవాయిద్యాలతో పదిమంది పెద్దలమధ్యా మంగళ సూత్రధారణం జరిగితే ఆ జీవితం సుఖాంతం అవుతుంది.

చీటికిమాటికి ఇంట్లో కలహాలు రేగుతున్నాయి. శర్మకి యేమీ పాలు పోవడంలేదు. ఒక్కసారి బుర్ర గిర్రున తిరిగింది. ఆనాడు సన్యాశి చెప్పిన మాటలు ప్రతిధ్వనియించాయి. అతను చెప్పిన "ప్రతి మాటా" తన గుండెల్లో "బాకు పోట్లు"గా అనిపించింది. అవును తను విశ్వాసఘాతకు డయిపోయాడు. యజమానిని తిరస్కరించాడు. అతనిమీద దుష్ప్రచారం లేవదీశాడు. భార్య మెడలోని మంగళ సూత్రమమ్మి తన చదువుకి ఖర్చుచేశాడు. ఆవిడ కూడా ఉదారురాలు! అలాంటివారికి ఎదురు తిరిగాడు. తన్ను యెంతో ముద్దుగా పెంచిన ఆ దంపతులని కాదని, యిష్టం వచ్చినట్లూ సంచేరించాడు. సన్యాశి చెప్పిన ప్రతి విషయం యదార్థం. తను ఇక సుఖంగా జీవించలేడు. తనని రత్నమ్మ సరిగా చూడదు. తను యిక అక్కడ ఆగలేకపోయాడు. రెండడుగులు వేశాడు గుమ్మం దిగి. రామానుజంగారు యేమన్నా అంటారా?—మనసు జంకింది. కాని ధైర్యంచేసి ముందుకి నడిచాడు.

రామానుజంగారు మంచంమీద, జ్వరంతో, బాధపడుతున్నారు. మాణిక్యమ్మగారు మంచం దగ్గర కూచుంది. సన్యాశి మరి కొంచెందూరంగా కూచున్నాడు.

మాణిక్యమ్మగారి కాళ్ళమీద పడ్డాడు శర్మ. బావురుమని యేడ్చాడు. లేవదీసింది మాణిక్యమ్మ. రామానుజంగారు ప్రక్కలో కూచుండబెట్టుకుని శర్మ కళ్లు తుడిచారు—దించిన తల యెత్తుకోలేదు శర్మ.